# * నరబలి *

రచన: ఎం. ఆర్. మోహన్ రావు

కిరణుడు తన మేకపిల్లతో ఆవూరికి సమీపమున గల సెలయేటి ప్రవాహానికివచ్చి మేకపిల్లను లేత చిగుళ్లతో మేపుతూ చిన్న చిన్న ప్రవాహాలను తన తోపాటు చెంగుచెంగున దూకిస్తూ తను పచ్చగడ్డిలో విహరిస్తూ అక్కడనుండే పక్షుల గానములకు తన్మయుడగుతూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించటానికి అలవాటుపడ్డాడు. ప్రతిరోజు మేకపిల్లతో ఆటలాడుతూ ప్రేమతో పెంచుతూ సాయంకాలానికి ఇంటికి చేరుకుంటాడు.

మేకపిల్లను ప్రాణంతో సమానంగా చూచుకుంటాడు కిరణుడు. ఒక్క నిముషము దాన్ని విడిచివుండలేకపోతాడు. తండ్రి ఆపల్లెకు నాయకుడు. చెడుప్రవర్తన గలవాడు. మద్యమాంసాల విషయంలో చెప్పనక్కరలేదు.

ఇటువంటి పామరజనంలో కిరణుడు రాళ్లగనిలో వజ్రమున్నట్టు వుంటాడు. కిరణుడు వాడి భావాలను ప్రవర్తనలను చూచి అసహ్యించుకుంటాడు. చిన్నప్పటినుంచి ఏదో కొద్దిగ విజ్ఞానం తెలిసినవాడు. కిరణుని ప్రవర్తనలను చూచి ఆ పల్లెప్రజలు నవ్వుకుంటారు.

పామరులకు దేవునకు బలి అను మూఢనమ్మకము పూర్వులు నాటిన బీజం. ఆవూరి అమ్మవారి జాతర దగ్గరకువచ్చింది. ప్రజలంతా కులాసాగా చిరునవ్వుమొగాలతో చిందులు త్రొక్కుతున్నారు. వారి ప్రవర్తనను జూచి అసహ్యించుకున్నాడు. వారి సంతోషానికి కారణం తెలియదు. తల్లిదగ్గరకు వెళ్లి ప్రజల సంతోషానికి కారణమడిగినాడు. తల్లి జాతరను గురించి పూర్తిగ జెప్పింది.

కిరణుని మనస్సు ఒక్కసారే చివుక్కుమన్నది. తల్లి చెప్పుతుంటే తన కెదురుగ ప్రత్యక్షంగా జరుగుతున్నట్టు కనబడ్డాయి. మనస్సులో విచారం రేకెత్తింది. తలవంచుకొని తన గదిలో వెళ్ళిపోయాడు. మేక పిల్లను దగ్గరకు తీసుకున్నాడు. కౌగలించుకొని కన్నీరు కార్చాడు.

జాతర వుత్సవం రెండు రోజులు ఆనాడు తండ్రి మరితర స్నేహితులతో కిరణుని మేకపిల్ల దగ్గరకు వచ్చారు. అప్పుడు కిరణ్ కన్నీరు గార్చుతూ లేత చిగుళ్లను దాని నోట్లో నిరికిస్తున్నాడు. తండ్రిని చూచి మర్యాద పూర్వకంగా నిలబడ్డాడు. స్నేహితులంతా మేకపిల్ల మెడపై తట్టిచూచారు. "బాగుందంటే బాగుందన్నారు" ఆ మేకపిల్లనే బలిగా నిశ్చయించుకున్నారు. పాపం కిరణునికి ఇవి ఏమీ అర్థంకాలేదు. తండ్రి దగ్గరకు వచ్చాడు.

"తండ్రీ బలి ఎవరికి" అన్నాడు విచారంతో.

"అమ్మవారికి" అని బదులు చెప్పాడు తండ్రి

"బలి ఇవ్వకపోతే" అని అంటుండగా

"ఛా! తప్పు నోరుముయ్యి బలి ఇవ్వకపోతే అమ్మవారు మూడు లోకాలు ముంచి పారేస్తుంది"

"అయితే! ఎవరిని బలిస్తారు"

"ఇదిగో ఈ మేకపిల్లనే' అని అనేటప్పటికి కిరణుని ప్రాణాలు పైకెగిరిపోయాయి. నిజంగా తన మేకపిల్లను బలి ఇచ్చినట్టుగా అతని కళ్ళకు కన్నట్టుంది. భయపడి వెంటనే కండ్లు మూసుకొని మేకపిల్లను కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడ్వటం మొదలు పెట్టాడు.

కిరణ్‌కు తండ్రి భావాలను మూఢ నమ్మకాలను చూస్తే ఒకవైపున నుండి నవ్వువస్తున్నది. మరొకవైపున నుండి తన మేకపిల్లను చూస్తుంటే దుఃఖమొస్తున్నది.

నోరులేని జంతువులకు మనుష్యాభిప్రాయాలు ఏమి తెలుస్తాయి. అమాయక జీవాలు. అమ్మవారికి తను బలి కాబోతున్నానని గ్రహించలేదు. కిరణుడు తనకొఱకు దుఃఖాంబుధిలో మునిగినాడని తెలియదు నిర్భీకతగా లేత చిగుళ్లను మేస్తున్నది. అయ్యో

యక జీవాన్ని చూస్తుంటే కిరణునకు ఒకవైపు నుండి నవ్వు మరియొక వైపునుండి కన్నీటిధారలు కారిపోతున్నాయి. మేకపిల్లను తీసుకొని పారిపోదామనుకున్నాడు. పంజరములో బంధింపబడ్డ చిలుకవిధంగా వుంది. తల్లితండ్రుల ఆజ్ఞలనే ఇనుపమరల్లో పడి నలిగి పోతున్నాడు, కిరణ్..........

ఆ రోజు జాతర వుత్సవం. ఆడమగ విచక్షణ లేకుండా మద్యమాంసాలు మెక్కి చిందులు త్రొక్కుతున్నారు. తండ్రి పూర్తిగా మధ్య పిశాచి బాహువులలో బంధింపబడ్డాడు. తల్లి కిరణునివలె కొంచెము జ్ఞానురాలు. అందఱితోను చిందులాడక మధ్యమాంసాలను విసర్జించి ఒక మూలనుండి చూస్తున్నది. కిరణ్ మరియొక చోట నిలబడ్డాడు. జాతర వుత్సవం అమ్మవారి గుడికి సాగిపోతున్నది. కిరణ్ కండ్లనుండి సెలయేటి ప్రవాహం వలె కన్నీటి ధారలు పారుతున్నాయి. వుత్సవంలో సాగిపోతున్న వాయిద్యాలు మ్రోతలు చెవులు గింగురు లెత్తుతున్నాయి.

కిరణ్ హృదయంలో విషాదము రేకెత్తుతున్నది

...........................................................

.....................అమాయక జీవం మేకపిల్ల మెడలో ఆకులు కట్టారు. దానిచుట్టూ యమభటుల్లాగ కత్తులు పట్టుకొని గంభీరంగా సాగిపోతున్నారు, కటికవారు. మేకపిల్లను చూచాడు కిరణుడు ఒక్కసారే కెవ్వు" మని కేక వేశాడు. గబా గబా వచ్చి మేకపిల్లను కౌగలించుకున్నాడు. మేకపిల్ల కంటినుండి కన్నీరు కారుతున్నది. తన చొక్కాతో తుడిచాడు. దగ్గరవున్న కటికవారు కిరణ్‌ను మేకపిల్లనుండి త్రోసివేశారు. కిరణ్‌నకు కోపం ఆగలేదు. వారితో కలబడటానికి శూలబోయాడు.

తండ్రి ఆజ్ఞ వెనుక తగ్గాడు................ చిన్నప్పటినుంచి తనతో ఆటలాడుతూ పచ్చగడ్డిలో విహరిస్తూ, లేత చిగుళ్లను మేస్తూ సెలయేటి ప్రవాహంలో దాహం తీర్చుకుంటూ వున్న ప్రాణరాశి నోరులేని జీవం కటికవారి కత్తులకు ఎరఅవుతున్నది. అమ్మవారికి బలి అవబోతున్నది.

......అమ్మవారి ముందు మేకపిల్లను నిలబెట్టారు. డప్పులు వుషారుగా వాయించుతున్నారు. కిరణ్ హృదయంలో వేయి శూలాలు పెట్టి పొడుస్తున్నట్టుగా ఆవేదన జెందుతున్నది.

మద్యమాంసాలు మెక్కి ఆలయంలో గంతులు వేస్తున్నారు. యమభటుల్లాగ మేకపిల్లను బలి చేయటానికి సిద్ధంగా కత్తులెత్తుకొని నిలబడ్డారు.

కిరణ్ ఈదృశ్యాని చూడలేక పోయాడు చేతులతో కన్నులుకు ముసుగువైచుకొన్నాడు. మేకపిల్ల అరుస్తూ కండ్లనుండి కన్నీటి ధారకారుస్తుంది.

ఆజ్ఞ అయింది చంపమని కత్తులు పైకెత్తారు. కిరణ్ నిలబడ్డాడు, మేకపిల్ల బలి అవబోతున్నది. కిరణ్ పరుగుపరుగునా వచ్చాడు. మేకపిల్లను అవతలకు త్రోసి దానిస్థానే నిలబడ్డాడు. మద్యము త్రాగి మదించిన యా కటికవారు ఇది గమనించలేకపోయారు. ఒక ప్రేటున కత్తులతో అతనిని బలి జేశారు. మత్తెక్కిన తండ్రి సంతోషముతో చిందులు త్రొక్కాడు.

ఇది గమనించిన తల్లి హృదయం బ్రద్దలయింది మేకపిల్ల అలాగే నిలబడి కన్నీరు కార్చుతూ అతని దేహాన్ని మూతితో తడుముతున్నది.

కథాంజలి

అన్ని హిగ్గిన్‌బాథమ్సు బుక్ స్టాల్సులోను దొరకును. వెల 0-3-0